ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 31 అక్టోబరు 2024


కడపలో బాణసంచా దుకాణాల వద్ద సందడి

నేడు దీపావళి



కడప కల్చరల్ అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉత్సాహం, ఆసక్తి, ఆధ్యాత్మికత మేళవింపుతో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలకు ఆనం దాన్ని పంచే జిలుగు వెలుగుల పండగే దీపావళి. గురువారం దీపావళి సంద ర్భంగా బుధవారమే జిల్లావ్యాప్తంగా సం దడి నెలకొంది. పిల్లలకు అత్యంత ఇష్ట మైన పండుగల్లో దీపావళిదే ప్రథమ స్థానం. పిల్లలంతా దీపావళి పండుగ ఎప్పుడొస్తుందా.. టపాసులు, ఎప్పుడు కాల్చాలా అని ఎదురుచూస్తుంటారు. ఎక్కడ చూసినా పిల్లలు టపాసుల సంగతులే చెబుతుంటారు. వీటికి తోడు రంగు రంగుల మతాబుల ముచ్చట్లు అంతా ఇంతా కాదన్న ట్లుగా కథలు కథలుగా ఆ సందడే వేరన్నట్లుగా చెప్పుకుంటుంటారు. ఆకాశమే హద్దుగా తారా జువ్వలు వివిధరంగుల్లో రయ్...రయ్ అం టూ దూసుకెళ్తుంటాయి. మరో వైపు భూమిపై భూచక్రాలు జామ్..జామ్‌గా గింగిరాలు తిరు గుతాయి. వాటికన్నా తామేమీ తక్కువ కాదన్నట్లుగా చిచ్చుబు డ్లు, కాకరొత్తులు, వంకాయ బాం బులు, లక్ష్మీ టపాసులు, థౌజండ్ వాలా పటాకులు, డబుల్ సౌండ్ రాకెట్లు పేల్చుతూ దీపావళి పండుగను సంతోషకరంగా చేసుకుంటారు.

సందడిగా మునిసిపల్ మైదానం

పటాసుల విక్రయ కేంద్రాలను కడప మునిసిపల్ మైదానం, నగర బిల్డప్ సమీప ఈద్గా వద్ద ఏర్పాటు చేశారు. ప్రజలంతా టపాసుల కొనుగోలుకు రావ డంతో మైదానంలో సందడి నెలకొంది. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసు లు ప్రత్యేక ఆంక్షలు విధించారు. ద్విచక్ర వాహనాలకు, భారీ వాహనాలకు ప్రత్యే కంగా వరుసలు కేటాయించారు. టపా సుల దుకాణాల వద్ద ఎలాంటి పేలుళ్ల జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా అగ్ని మాపక వాహనాన్ని అక్కడే అందుబా టులో వుంచారు. టపాసుల ధరలు విప రీతంగా పెరగడంతో తమ బడ్జెట్ అను సరించి కొనుగోళ్లు చేశారు. టపాసుల విక్రయ కేంద్రాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి నిశితంగా పరి శీలించారు. ఆయనతో పాటు టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐ, హుసేన్, వన్ టౌన్ పోలీసులు విక్రయ కేంద్రాలను పరిశీలించారు. టపాసుల విక్రయ కేం ద్రాల వారు తప్పనిసరిగా జీఎస్టీ చెల్లిం చాలని జీఎస్టీ కార్యాలయ డిప్యూటీ కమిషనర్ భువనేశ్వరి బుధవారం ము నిసిపల్ మైదానంలోని విక్రయ కేంద్రాల వద్దకెళ్లి ఆదేశాలిచ్చారు. లేని పక్షంలో పెనాల్టీ కట్టాల్సి ఉంటుందన్నారు.

జాగ్రత్తలు పాటించాలి : ఎస్పీ

బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్త లు పాటించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. చిన్నారులు తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాల న్నారు. బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలి. రోడ్లవెంబడి వెళ్లే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టపాసులు కాల్చాలి. ముం దు జాగ్రత్తగా బకెట్లలో నీరు అందు బాటులో ఉంచుకోవాలి. లైసెన్సు ఉన్న దుకాణంలోనే బాణసంచా కొనుగోలు చేయాలి. బాణసంచా ప్యాకెట్‌పై ముద్రించిన తయారీ తేదీ, ప్యాకెట్‌పై తయారీదారు ముద్రించిన జాగ్రత్తలను పాటించాలి. పెద్ద టపాసులు కాల్చేట ప్పుడు పిల్లలను దూరంగా ఉంచాలి. సగం కాలిన టపాసులను మళ్లీ కాల్చేం దుకు యత్నించరాదు.





ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

● ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

కడప కలెక్టరేట్/క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చీకట్లపై వెలుగు సాధించే విజయానికి చిహ్నంగా హిందువులు దేశవ్యాప్తంగా దీపావళిని కన్నుల పండవగా చేసుకోవాడం ఆనవాయితీ. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి, మీడియా మిత్రులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి చీకట్లను పారదోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులు నింపాలని ఆకాంక్షించారు. బాణసంచాను సరైన జాగ్రత్తలతో కాల్చాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

శబరిమలై యాత్రకు ఆర్టీసీ అద్దె బస్సులు

పీలేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శబరిమలై యాత్రకు అద్దెకు పంపడా నికి తమ వద్ద సరికొత్త బస్సులు సిద్ధంగా ఉన్నాయని ఆర్టీసీ పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ బస్సులకు కర్ణాటక, తమిళనాడు, కేరళలో ఎలాంటి ఆర్టీవో పన్నుల వసూళ్లు ఉండవని, ప్రతి బస్సులో ఏడుగురికి ఉచిత ప్రయాణం కలుగజే స్తున్నామని పేర్కొన్నారు. భక్తుల కోరిక మేరకు కావాల్సిన రూట్లలో, కావా ల్సినన్ని రోజులకు అద్దెకు బస్సులు ఇస్తామని తెలిపారు. నిర్దేశిత సమయా నికంటే 12 గంటలు ఆలస్యమైనా ఎటువంటి రుసుము ఉండదని వివరించారు. అద్దె బస్సుల కోసం 9959225679, 9014700628 నెంబర్లను సంప్రదించాలని కోరారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోగస్ డ్వాక్రా సంఘాలపై విచారణ?

● బ్యాంకుల వారీగా గ్రూపు ఖాతాల పరిశీలన
● అధికారులకు సమాచారం ఇచ్చారని ఆర్పీపై మరో ఆర్పీ దాడి
● పోలీసుస్టేషనుకు చేరిన పంచాయితీ

ప్రొద్దుటూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బోగస్ డ్వాక్రా సంఘాలు ఏర్పడ్డాయని ప్రస్తుత ప్రభుత్వం థర్డ్ పార్టీ చేత విచారణ మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఆయా బ్యాంకులలో రుణాలు పొందిన డ్వాక్రా గ్రూపు ఖాతాలను థర్డ్ పార్టీకి చెందిన అధికారులు, మెప్మా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ గ్రూపులు మెప్మా కార్యాలయ రికార్డుల్లో నమోదయ్యాయా లేదా అని విచారిస్తున్నారు. అలాంటి బోగస్ డ్వాక్రా గ్రూపుల ద్వారా ఎంత రుణాలు బ్యాంకుల నుంచి తీసుకున్నది నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఈ బోగస్ డ్వాక్రా గ్రూపుల ద్వారా అక్రమంగా బ్యాంకుల నుంచి కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. గ్రూపు సభ్యులకు కూడా తెలియకుండా ఆర్పీలు గుట్టుగా ఈ అక్రమాలు సాగించినట్లు వెల్లడవుతోంది. ఇందుకు గత వైసీపీ ప్రభుత్వంలో మెప్మాలో ఉండే ఒక అధికారిణి సహకరించినట్లు ప్రచారం సాగుతోంది. ఆమె ఈ బోగస్ గ్రూపుల రుణాలలో భారీగా డబ్బులు వెనకేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి సీవోల సంతకాలను ఆర్పీలే ఫోర్జరీ చేసి డాక్యుమెంటేషన్ చేసినట్లు విచారణలో వెలుగుచూస్తోంది. ఈ క్రమంలో కొందరు వైసీపీ నాయకులు విచారణ జరిగిన బ్యాంకుల వద్దకు వెళ్లి బెదిరించి సీసీ ఫుటేజీలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీన్ని బట్టి వైసీపీ నాయకుల పాత్ర ఈ బోగస్ సంఘాల వెనుక ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ సీసీ ఫుటేజీల ఆధారంగా అధికారులతో పాటు కొందరు ఆర్పీలు బ్యాంకులకు వెళ్లినట్లు గుర్తించిన వైసీపీ నాయకులు వారి మీద ఆగ్రహంతో ఉన్నారు. విచారణ అధికారులకు సమాచారమిస్తున్న ఆర్పీలపై మండిపడుతూ వారిపై కూడా ఆరోపణలు చేస్తూ వారితో ఘర్షణకు దిగుతున్నారు.

దాడి చేసి.. వారే ఫిర్యాదు

ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 27వ వార్డుకు చెందిన ఒక ఆర్పీ ఇంటి వద్దకు బోగస్ సంఘాల ఏర్పాటు పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్పీ వెళ్లి ఘర్షణకు దిగారు. ఆర్పీపై దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా దాడి చేసిన వారే పోలీసు స్టేషనుకు వెళ్లి బాధిత ఆర్పీపై ఎస్సీఎస్టీ కేసు నమోదుచేయాలని ఫిర్యాదు చేశారు. దీంతో బాధిత ఆర్పీని పోలీసులు స్టేషనుకు తీసుకువెళ్లారు. ఈ విషయం మెప్మా అధికారుల దృష్టికి రావడంతో వారు వెంటనే పోలీసు అధికారులతో మాట్లాడి జరుగుతున్న విచారణ గురించి తెలిపి బాధిత ఆర్పీని పోలీసు స్టేషను నుంచి విడిపించారు. ఈ నేపథ్యంలో బోగస్ గ్రూపులు సృష్టించిన మరికొందరు ఆర్పీల్లో ఆందోళన మొదలైంది. వారం లోపు ఈ బోగస్ గ్రూపుల విచారణ పూర్తి కాగానే ఎన్ని గ్రూపులు ఎన్ని కోట్ల రుణాలు అక్రమంగా తీసుకుంది.. ఎవరెవరు ఇందులో పాత్రధారులు సూత్రధారులు వెల్లడిస్తామని మెప్మా అధికారులు వెల్లడిస్తున్నారు.

రోజంతా జగన్ ప్రజాదర్బార్

పులివెందుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రోజంతా ప్రజాదర్బార్ నిర్వహించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం పులివెందులకు వచ్చారు. రెండో రోజు బుధవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌కు ప్రజలు అధికంగా తరలివచ్చారు. నియోజకవర్గ ప్రజలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా అభిమానులు, నేతలు తరలివచ్చారు. బుధవారం ఉదయం 9గంటలకు ప్రజాదర్బార్ ప్రారంభించి మధ్యాహ్నం 3గంటల వరకు అక్కడే ఉన్నారు. పలువురు తమ వ్యక్తిగత సమస్యలను వివరించారు. అనంతరం.. ఇటీవల వివాహాలు జరిగిన నేతల ఇళ్లకు వెళ్లి వారిని ఆశీర్వదించారు. తిరిగి క్యాంపు కార్యాలయం చేరుకుని సాయంత్రం 4.30గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న వైఎస్ జగన్


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

3వ తేదీ నుంచి పెద్దదర్గా ఉరుసు

● ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కడపలోని ప్రఖ్యాతిగాంచిన అమీన్‌పీర్ పెద్దదర్గా ఉరుసును నవంబరు 3వ తేదీ నుంచి 21 వరకు కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో అమీన్‌పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణపై సమీక్షించిన ఆమె మాట్లాడుతూ నవంబరు 3న ఉరుసు ప్రారంభ సూచికగా దర్గా నుంచి నగరంలోని పలు ప్రధాన మార్గాల ద్వారా దాదాపు 500 మందితో ఊరేగింపు సాగుతుందన్నారు. ఉత్సవానికి నలు దిశల నుంచి లక్షలాది భక్తులు వస్తారని వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుం డా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అధిక సంఖ్యలో సిబ్బందిని నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 108, అంబులెన్స్‌లు, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలందరూ కుటుంబ సమే తంగా హాజరై ఉత్సవాలను దిగ్విజయం చేయాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ పోలీసు శాఖ అన్ని కోణాల్లో భద్రతా ఏర్పాట్లను చేప డుతుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఇబ్బందులు లేకుండా రూట్ మ్యాపింగ్ చేసి సిబ్బందికి డ్యూటీలు కేటాయించామన్నారు. పెద్దదర్గాకు వెళ్లే దారుల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీఓ జాన్ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్ రెడ్డి, అమీన్‌పీర్ దర్గా మేనేజరు మహమ్మద్ అలీఖాన్, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారిపై లారీ డ్రైవర్ల దాడి యత్నం

సికెదిన్నె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాహనాలను తనిఖీ చే సేందుకు వెళ్లిన రవాణాశాఖ అధికారులపై ఉత్తర భారతదేశానికి చెందిన లారీ డ్రైవర్లు దాడికి ప్రయత్నించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కడప రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న మోటారు వె హికల్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి విజయభాస్కర్, హోంగార్డు మోహన్‌తో క లిసి ఈనెల 24వ తేదీ తిరుపతి రోడ్డులోని భాకరాపేట వద్ద లారీ డ్రైవ ర్లు విశ్రాంతి తీసుకునే ప్రదేశంలో తనిఖీ చేపట్టడానికి వెళ్లారు. ఆ సమయంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ యూనిఫాంలో లేరు. దీంతో ఆయన నకిలీ అధికారి అనుకుని రాజస్థాన్, బీహార్, పంజాబ్‌కు చెందిన లారీ డ్రైవర్లు వాగ్వాదానికి దిగి దాడికి ప్రయత్నించారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వె లుగులోకి వచ్చింది. దీనిపై రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మాట్లాడుతూ.. రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసేటప్పుడు తప్పని సరిగా యూనిఫాం ధరించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కాగా.. స దరు అధికారి తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు లారీ, టిప్పర్ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

సౌత్‌కొరియా పరిశోధనకు వైవీయూ ప్రొఫెసరు శంకర్


ప్రొఫెసరు ఎంవీ శంకర్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): వైవీయూ మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ డిపార్ట్‌మెంటు ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ పరిశోధన నిమిత్తం బుధవారం దక్షిణకొరియా బయలుదేరి వెళ్లారు. ఆ దేశం అంతర్జాతీయ స్థాయిలో 81 మంది పరిశోధకులను బ్రెయిన్ స్కూల్ ఫెలోలుగా ఎంపిక చేయగా అందులో శంకర్ ఒకరు. సూక్ష్మ పదార్థాలను ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై పరిశోధన చేస్తారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్‌లో బ్రెయన్ స్కూలు ఫెలోగా పనిచేస్తారు. ఏడాదిపాటు చేసే పరిశోధనలతో రాబోయే రోజుల్లో వైవీయూకు మెరుగైన ఎన్ఐఆర్ఎఫ్ నాక్ అక్రిడేష్ వంటి ర్యాంకులు పొందే అవకాశం కలుగుతుంది. పరిశోధనలకు వెళుతున్న ప్రొఫెసర్ శంకర్‌ను వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, నానో టెక్నాలజీ సహ ఆచార్యులు డాక్టర్ మమత అభినందించారు. అలాగే ఆయన ఇంటికి వెళ్లి ప్రొఫెస్ మూలా మల్లికార్జునరెడ్డి ఘనంగా సన్మానం చేశారు.

బ్రహ్మంగారి సన్నిధిలో వెంకయ్యనాయుడు సతీమణి ఉషారాణి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని బుధవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషారాణి దర్శించుకున్నారు. ఆమెకు వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఎస్.ఈశ్వరయ్యఆచారి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని అందించారు. ఆలయ సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుటుంబ సభ్యులతో కాలజ్ఞానం గురించి చర్చించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి కుమార్తె ఈశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతులు వీరకుమారస్వామి అమ్మవారి జీవిత చరిత్ర తెలిపారు. అనంతరం ఉషారాణికి ఈశ్వరీదేవి అమ్మవారి చిత్రాన్ని, కాలజ్ఞాన పుస్తకాన్ని పీఠాధిపతుల దంపతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మాచనూరు సుబ్బరాయుడు, మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, బీజేపీ మండల అధ్యక్షులు చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభీష్టం మేరకే పాత బీమా అమలు

● ప్రీమియం కట్టకుండా దగా చేసిన జగన్
● పట్టభద్రుల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల అభీష్టం మేరకు పాత బీమా విధానం అమలు చేస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. నాలుగు నెలలు ప్రతిపక్షంలో కూర్చోగానే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి రైతులపైన అమిత ప్రేమ ఒలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ బుధవారం పులివెందులలోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 2019లో ప్రధానమంత్రి పసల్ బీమా నుంచి బయటికి వచ్చి సొంతంగా బీమా కంపెనీని నెలకొల్పుతానని, ప్రభుత్వం నుంచే ప్రీమియం కూడా కడతామని బీమాను తామే క్లెయిం చేసి ఇస్తానని జగన్ చెప్పారన్నారు. అధికారం చేపట్టాక రైతులను జగన్ మోసం చేశారన్నారు. రైతుల వత్తిడితో 2019 జూలైలో రూ.1252 కోట్లు పరిహారం చెల్లిస్తున్నాం అని చెప్పి రూ.921 కోట్లు మాత్రమే చెల్లించి మిగిలిన రూ.334 కోట్లు ఎగ్గొట్టారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో 58లక్షల77వేల మందికి ప్రీమియం చెల్లిస్తానని చెప్పి తొమ్మిదిలక్షల మందికి తగ్గించార న్నారు. కూటమి ప్రభుత్వంలో త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు ఒకేసారి అందించేందుకు విధివిధానాలను తయారు చేస్తున్నారని త్వరలో అందిస్తామన్నారు. పులివెందులలో ఈ ప్రాంత అరటి రైతుల కోసం ఒక కోల్డ్ స్టోరేజీ కట్టడానికి ఐదేళ్ల సమయం కూడా సరిపోక పోవడం చూస్తే రైతులపై జగన్‌కు ఉన్న ప్రేమ ఏదో ర్థమవుతుందన్నారు. పులివెందుల ప్రాంతంలో కోట్లు ఖర్చు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులన్నీ కూడా పెండింగు ఉన్నాయని , వైసీపీ పాలనలో ఒక ఎకరా కూడా సాగు భూమి పెరగలేదన్నారు. ఇప్పటికైనా జగన్ రైతుల కోసం ఆలోచించే వ్యక్తి అయితే వచ్చే సమావేశంలో రైతులకు మేలు జరిగే అంశాలపై మంచి సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, జిల్లా పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై.. నోటీసులతో సరి..!

● సెర్ప్ సీఈఓ ఆదేశాలతో అయినా ముందడుగు పడేనా?

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండలంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సంబంధించిన దాదాపు రూ.80 లక్షలు దారిమళ్లాయి. ఈ వ్యవహారంపై ఏడాది క్రితం మహిళా సంఘాల ప్రతినిధులు వల్లూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదు. గత ప్రభుత్వంలో అక్రమార్కులకు పెద్దల అండ ఉండడంతో కేసులు నమోదు చేయలేని పరిస్థితి. ప్రభుత్వం మారింది.. ఇకనైనా చర్యలు ఉంటాయని అందరూ భావించారు. మహిళా సంఘాల ప్రతినిధులు కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కూడా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించినట్లు సమాచారం. అయినా ఇప్పటికీ కేసు నమోదు కాలేదు. వివరాలిలా..

వల్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.95 లక్షలు నిధులు దారి మళ్లినట్లు అధికారులు గుర్తించారు. తప్పెట్ల ఎంఎఎస్ నుంచి రూ.59.60లక్షలు, తప్పెట్ల వీఓ-1 నుంచి రూ.10.93 లక్షలు, తప్పెట్ల వీఓ-2 నుంచి రూ.9.54 లక్షలు, దుగ్గాయపల్లె వీఓ-2 నుంచి రూ.3.80లక్షలు, తోళ్ల గంగనపల్లె నుంచి రూ.1.49లక్షలు, లేబాక నుంచి రూ.65.72 లక్షలు దారి మళ్లినట్లు సమాచారం. దీంతో శాఖాపరమైన విచారణతో పాటు కలెక్టరు ఆదేశాలతో థర్డ్ పార్టీ విచారణ కూడా చేపట్టింది. అక్రమాలు జరిగినట్లు గుర్తించిన థర్డ్ పార్టీ విచారణ అధికారి.. నిధులు దారి మళ్లడం వెనుక సెర్ప్‌లోని అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని, మరింత లోతుగా విచారించాల్సి ఉందని తన నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా కమ్యూనిటీ కోఆర్డినేటరు సునీతపై సస్పెన్షన్ వేటు వేశారు. థర్డ్ పార్టీ విచారణ అధికారి ఎదుట తాను డ్రా చేసిన నిధుల నుంచి రూ.20లక్షలు మేర గతంలోని ఏరియా కోఆర్డినేటరుకు ఇచ్చినట్లు ఆమె వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. ఇందులో ఎవరికి ఎంత మేర ప్రమేయం ఉందనేది నిగ్గు తేల్చాలంటూ మహిళా సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు మాత్రం ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సెర్ప్ సిబ్బందికి ఇక డీఆర్డీయే అధికారులు నోటీసులు ఇవ్వడంతో సరిపెట్టారు. నెలలు గడుస్తున్నా ఈ నోటీసులకు సమాధానం కూడా ఇవ్వలేదని సమాచారం.



ఇదిలా ఉంటే నోటీసులు అందుకున్నవారిలో అన్నమయ్య జిల్లాలో డీఆర్డీయే పీడీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బి.సత్యనారాయణ కూడా ఉన్నారు. ఈయన 2014 ఆగస్టు 20 నుంచి 2019 జూలై 12 వరకు కమలాపురం ఏరియా కోఆర్డినేటరుగా పనిచేశారు. ఆ సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగానే నిధుల దుర్వినియోగం జరిగాయని అధికారులు భావించారు. ప్రస్తుతం సత్యనారాయణ అన్నమయ్య జిల్లాలో ఏరియా కోఆర్డినేటరుగా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జి పీడీగా ఉన్నారు. ఆయన తరువాత కమలాపురం ఏరియా కోఆర్డినేటరుగా విధులు నిర్వహించిన రఘునాథరెడ్డికి కూడా నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరారు. నోటీసులకు నెలలు గడుస్తున్నా సంజాయిషీ ఇచ్చిన పరిస్థితి లేదు. అయినా ఉన్నతాధికారులు మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంతు చిక్కడంలేదు.

సెర్ఫ్ ఆదేశాలతో అయినా..

ఇటీవల సెర్ప్ సీఈఓ జూమ్ మీటింగ్‌లో ఎక్కడా అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్డీయే ప్రాజెక్టు డైరెక్టర్లను ఆదేశించారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అందుకు సంబంధిత పీడీలే కారణమవుతారని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఇప్పటికైనా నిధుల దుర్వినియోగంపై దృష్టి సారించి చర్యలు తీసుకుని మహిళా సంఘాల సొమ్ము రికవరీ చేయాలని బాధితులు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాం

వల్లూరు మండలంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. వారి నుంచి సమాధానం రావాల్సి ఉంది. సొమ్ము స్వాహా చేసిన కమ్యూనిటీ కోఆర్డినేటరు నుంచి కొంత మొత్తం రికవరీ చేశాం. త్వరలో ఈ విషయంపై చర్యలు తీసుకుంటాం.

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్డీఏ

వెంకటనారాయణకు వైవీయూ డాక్టరేట్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైవీయూ తెలుగుశాఖపరిశోధకులు వెంకట నారాయణకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేశారు. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు ఎంఎం వినోదిని పర్యవేక్షణలో తెలుగులో శ్రామిక కథలు, శ్రీచైతన్యం అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తెలిపారు.

2న అయ్యప్పస్వామి పూజల అంకురార్పణ మహోత్సవం



కడప కల్చరల్ అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని నవంబరు 2వ తేదీ శనివారం నగర హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన కోదండ రామాలయంలో అయ్యప్పస్వామి పూజల అంకురార్పణ మహోత్సవాలు, మండల పూజలు ప్రారంభం కానున్నాయి. 2వ తేదీ తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమై 5 గంటలకు గురుస్వామిచే అయ్యప్ప మాల ధారణ, 6-30 పరమేశ్వరునికి రుద్రాభిషేకము, సాయంత్రం ధ్వజారోహణ, తదుపరి అయ్యప్పస్వామికి కలశారాధన, పల్లకిసేవ, కోలాటాలు, 7 గంటలకు పడిపూజ, రాత్రి 9 గంటలకు హరివరాసనం, తదుపరి అన్నప్రసాదాలు జరుగనున్నాయని ఆలయకమిటీ ప్రతినిధులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తృటిలో తప్పిన ప్రాణాపాయం

లింగాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న వ్యక్తిని తప్పించబోయి ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఎగువపల్లెకు చెందిన లక్ష్మీనారాయణరెడ్డి తన ఆటోలో పులివెందులకు బుధవారం ఉదయాన్నే టమోటాలు తీసుకెళ్లాడు. తిరిగి వస్తూ గుణకనపల్లె సమీపంలో రోడ్డు పక్కన వ్యక్తిని తప్పించబోయి ఆటో ప్రమాదానికి గురవడంతో పైడిపాళెం చక్రవర్తిపై ఆటోపడింది. దీనితో చక్రవర్తి తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స కోసం గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు.

అనుమతులు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : కమిషనర్


టపాసుల షాపులను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా టపాకుల విక్రయాల్లో జాగ్రత్తలు పాటించాలి, ఇచ్చిన అనుమతులను అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కడప నగరం మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన దీపావళి స్టాల్స్‌ను పరిశీలించిన ఆయన అన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని స్టాల్స్ యాజమాన్యాన్ని ఆదేశించారు. అదనంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే వాటిని వెంటనే తొలిగించాలని సూచించారు. పర్యవేటన బాధ్యతను టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రాన్స్‌పోర్టు విభాగం సిబ్బందికి అప్పగించారు. అసిస్టెంటు సిటీ ప్లానర్ మునిరత్నం, డీఈ రాజేశ్, కిరణ్, ఏఈ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ, కడప ఉక్కును కాపాడుకుందాం

కడప(వినాయకనగర్), అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఉక్కు రక్షణ కోసం, కడప ఉక్కు ఏర్పాటు కోసం నవంబరు 1న విశాఖపట్నంలో జరిగే విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు రామన్న, రాము, రాహుల్, శివకుమార్, రవి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ భవనంలో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి విద్యార్థి సంఘాలు పోరాటాలు కొనసాగిస్తున్నాయన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు జగదీశ్, ఆదిల్, ఆంజనేయరాజ్, జిల్లా నేతలు డేవిడ్‌రాజ్, అంజి, వినయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

'అవకాశాలు మెరుగవుతున్నాయి'


మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు కూడా మెరుగుపడుతున్నాయని తెలుగునాడు విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిశ్రీనివాసరెడ్డి తెలిపారు. శాన్‌ఫ్రాన్సిస్‌కోలో విద్యాశాఖ మాత్యులు నారాలోకేశ్‌ను ఆయన కలిశారు. విదేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తెప్పించేందుకు లోకేశ్ ప్రయత్నం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతకు ఇదొక వరమన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలు రాష్ట్రంలో ప్రారంభించేందుకు రావడం శుభ పరిణామమన్నారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

లింగాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో బుధవారం లింగాల వాసి అలవలపాటి పాపిరెడ్డి, అనంతమ్మ దంపతులు తమకుమార్తె కీర్తిశేషులు మాదవీలత వర్ధంతి సదర్భంగా వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాధవీలత కుమార్తెలు సుష్మరెడ్డి, హారికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్తాదివస్


పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ముందస్తు రాష్ట్రీయ ఏక్తాదివస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ అక్టోబరు 31న సర్దార్ వల్లభాయ్‌పటేల్ జన్మదినం పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తాదివస్‌ను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ విజయలక్ష్మీదేవి, డాక్టర్ స్వరూప, ఐక్యూసీ కోఆర్డినేటరు డాక్టర్ సీవీ క్రిష్ణవేణి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్రానికి బస్సు సౌకర్యం కల్పించాలి


ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న సట్టిభారవి

వల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రోజూ కడప నుంచి దక్షిణ కాశీ పుష్పగిరి క్షేత్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సట్టిభారవి కడప ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డిని కోరుతూ బుధవారం ఆర్ఎం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కడప నుంచి చెన్నూరు, పుష్పగిరి క్షేత్రం, ఖాజీపేట మీదుగా మైదుకూరు వరకు, మైదుకూరు నుంచి ఖాజీపేట, పుష్పగిరి క్షేత్రం, చెన్నూరు మీదుగా కడప వరకు భక్తుల సౌకర్యార్థం బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే స్పందిస్తూ ఫిజిబిలిటీ రిపోర్టు పంపాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. విశ్రాంత డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఎం.తులసీశ్వర్‌రెడ్డి, ఆర్టీసీ విశ్రాంత ఆఫీసర్ రమణ తదితరులున్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రవీంద్ర నగర్ వాసి నాగేశ్వర్‌రావు (73) ఒంటరితనం భరించలేక మానసిక వేదనతో ఈనెల 29న తాను ఉన్న ఇంట్లోనే విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన ఫెథాలజీ విభాగం హెచ్‌ఓడీగా పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. తరువాత ఓ రక్తదాన సేవా సమితిలో పనిచేసేవారు. ఈయన తన భార్య, పిల్లల నుంచి దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో ఈ చర్యకు పాల్పడ్డాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుమారుడు వంశీ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గురుకుల్ విద్యాపీఠ్‌లో ముందస్తు దీపావళి



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూలులో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయకమైన పూజ పునస్కారాలతో దీపావళి పండుగను చేసుకున్నారు. టపాసులు పేల్చి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఎ.నీలాకుమారి, సీఈఓ ఏఎల్ వివేకానంద్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు


చిన్నారులతో ముందస్తు దీపావళి నిర్వహిస్తున్న సీఈఓ శ్రీదేవి, వైస్‌ఛైర్మన్ సాయి సుధీర్‌కుమార్ రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను చేసుకుంటామన్నారు. పాఠశాల సీఈఓ శ్రీదేవి మాట్లాడుతూ దీపావళి అనే పదం సంస్కృత పదం నుంచి వచ్చిందని, ఈ పండుగ సాధారణంగా చీకట్లపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. పాఠశాల వైస్‌ఛైర్మన్ సాయిసుధీర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

బాలవికాస్ హైస్కూలులో ముందస్తు దీపావళి సంబరాలు


దీపావళి సంబరాల్లో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లె బాలవికాస్ పాఠశాలలో ఘనంగా ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ గంగయ్య మాట్లాడుతూ దీపావళి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. కరస్పాండెంట్ సుబ్బరాయుడు మాట్లాడుతూ చెడుపై మంచిసాధించిన విజయానికి సంతోషంతో ప్రజలు చేసుకునే పండుగ దీపావళి అని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు దీపావళి టపాసులను రంగవల్లులతోనూ బాణసంచా కాల్చి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

డిసెంబరు 31 లోగా పరిశ్రమలు లైసెన్స్ చెల్లించాలి

● కర్మాగారాల తనిఖీ అధికారి కృష్ణ మూర్తి

కడప కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం కర్మాగారాల యజమానులు 2025వ సంవత్సరానికి చెల్లించ వలసిన నిర్ణీత లైసెన్స్ రుసుము డిసెంబరు 31వ తేదీ లోగా సీఎఫ్ ఎంఎస్ ద్వారా చెల్లించాలని కర్మగారాల తనిఖీ అధికారి కృష్ణ మూర్తి పేర్కొన్నారు. చెల్లించిన రుసుము చలానాలను కర్మాగారాల తనిఖీ కార్యాలయానికి పంపాలన్నారు. లైసెన్స్ ఫీజుల్లో హెడ్ అకౌంట్ (0230001040001000000 వీఎన్), డీడీఓ కోడ్ (12011506001)లలో ఎటువంటి మార్పు లేదన్నారు. గడువు లోగా సరిపడా లైసెన్స్ రుసుము చెల్లించి చలానాను తమ కార్యాలయానికి పంపాలని ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యావరణ అనుకూల పద్ధతుల్లో దీపావళి పండుగ చేసుకోవాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుకూల పద్ధతుల్లో దీపావళి పండుగను జిల్లా ప్రజలు ఘనంగా చేసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఇంజనీరు సుధా కురుబ పేర్కొన్నారు. బుధవారం సంస్థ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్గించేలా రూపొందించిన పోస్టర్లను ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ తన చాంబరులో విడుదల చేశారు. అనంతరం నగరంలోని నారాయణ స్కూలు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీపావళి పండుగను పర్యావరణ హితంగా చేసుకోవటంపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ కళాజాత బృందం వారిచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాదకర రసాయనాలతో తయారు కానీ పర్యావరణ హిత టపాసులను మాత్రమే కాలుద్దామన్నారు. కాలుష్యాన్ని తగ్గించేలా పశు పక్షాదులు, రోగులు, వృద్ధులు, చిన్న పిల్లల సంక్షేమం దృష్ట్యా తక్కువ శబ్దం వచ్చే టపాసులను మాత్రమే వినియోగించాలన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతంలో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ధనత్రయోదశి

వేంపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాల వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనత్రయోదశి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి 108 రకాల పిండివంటలు నైవేద్యంగా సమర్పించి మహిళలు తమ భక్తిని చాటుకున్నారన్నారు.

వన్యప్రాణి అలుగు అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు అరెస్టు

● ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరు..


వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్ఓ వినీత్‌కుమార్


ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

కడప క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణ అటవీ ప్రాంతంలో రెండు కేసులకు సంబంధించి ఏడుగురిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. జిల్లా ఫారెస్టు కార్యాలయంలో డీఎఫ్ఓ వినీత్‌కుమార్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసుల వివరాలు వెల్లడించారు.

బద్వేలు అటవీ రేంజ్ బ్రాహ్మణపల్లె సెక్షన్ బోయి నపల్లె బీట్ పరిధిలో అరుదైన వన్యప్రాణిని అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందడంతో బద్వేలు అటవీ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసి.. అలుగును స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. చైనాలో అలుగుకు మంచి ధర పలుకుతుందని.. బ్లాక్‌మార్కెట్లో దీని ధర విలువ కట్టలేరన్నారు. చైనాలో మెడిసిన్‌కు అలుగు ఉపయోగిస్తారని తెలిపారు. పట్టుబడిన నింది తుల్లో గోపవరం మండలం రామిరెడ్డి పాలెం వాసి రాగిశ్రీను, బద్వేలు మండలం లక్ష్మిపాలెం వాసి పాల గిరి పెంచలయ్య, నెల్లూరు జిల్లా వింజమూరు, మర్రిపాడు వాసులు వెంకటాద్రి, ఓంకారం బాబు, లెక్కల శివారెడ్డి ఉన్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి అలుగు, ఆటో, రెండు ద్విచక్ర వాహ నా లను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. అడవుల్లో ఉన్న వన్యప్రా ణుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

బద్వేలు అటవీ రేంజ్ బ్రాహ్మణపల్లె బీట్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించి కాశినాయన మండలం నారాయణపల్లె వాసి రాంబాబు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిళం వాసి తురక సుబ్బరాయుడులను అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి 109 కిలోల బరువున్న నాలుగు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో సిబ్బంది బాగా పనిచేశారంటూ అభినందించారు.



అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి : ఫైర్ అధికారి బస్విరెడ్డి

కడప క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా పిల్లలు పెద్దలు ఇలా అందరూ కలిసి సంతోషంగా చేసుకోవడం, సాయంత్రం బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటారు. అయితే అగ్ని ప్రమాదాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే మాత్రం ప్రమాదాలకు గురి కావాల్సిందే మరి అధికారుల సూచనలు పిల్లలు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు. అగ్ని ప్రమాదాలపై కడప ఫైర్ స్టేషన్ అధికారి బస్విరెడ్డి పలు సూచనలు చేశారు.

- ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణం నుంచే బాణసంచా కొనుగోలు చేయాలి.
- ఇళ్లల్లో నిల్వ ఉంచరాదు. ప్రమాదం జరగకుండా ఉండే ప్రాంతాల్లో భద్రపరచాలి.
- దీపావళి మందు గుండు సామగ్రి చిన్న పిల్లలకు దూరంగా ఉంచాలి.
- కాటన్ దుస్తులు ధరించి దీపావళి మందుగుండు సామగ్రి కాల్చడం మంచిది. దీని వల్ల దుస్తులు అంటు కునే ప్రమాదాల నుంచి నివారణ పొందవచ్చు.
- ఆరుబయట టపాసులు కాల్చడం మంచిది.
- కళ్లల్లో నిప్పురవ్వల రేణువులు పడకుండా చూసుకోవాలి.
- తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడేవారి వద్ద ఎక్కువ శబ్దంతో వత్తిడితో పేలే బాంబులు వంటివి కాల్చవద్దు.
- గడ్డివాము, పూరిళ్లు, చెత్తకుప్పల వద్ద మందుగుండు సామగ్రి కాల్చవ ద్దు, ఇవి త్వరగా మండుతాయి.
- తారాజువ్వలు, రాకెట్స్ వంటి ఆకా శం వైపు వెళ్లే సామగ్రి వల్ల గడ్డివా ములు, పూరిళ్లు అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని కాల్చడం తగ్గించడం మంచిది
- బాణసంచా కాల్చేముందు పాదరక్షలు ధరించాలి.
- ముఖాన్ని దగ్గరగా ఉంచి క్రాకర్స్ కాల్చవద్దు,
- రద్దీగా ఉండే ప్రదేశాలు, ఇరుకు ప్రాంతాల్లో, చిన్న చిన్న సందుల్లో ఇళ్లకు దగ్గరగా టపాసులు కాల్చవద్దు.
- సరిగా పేలని టపాసులను మళ్లీ కాల్చడానికి ప్రయత్నించవద్దు
- ప్రభుత్వ ఆదేశానుసారం గ్రీన్‌కాకర్స్‌ను మాత్రమే కాల్చవలెను. దీని వల్ల వాయు, ధ్వని కాలుష్యం తగ్గించవచ్చు.
- రాత్రి 8గంల నుంచి 10గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చవలెను.
- పర్యావరణ హితమైనగ్రీన్ టపాసులు కాల్చడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రిస్తూ రేపటి తరాన్ని కాపాడుకుందాం.

'సర్కిళ్లు త్వరగా పూర్తి చేయాలి'

కడప నాగరాజుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెండింగ్ ఉన్న అల్మాస్‌పేట, మార్కెట్‌యార్డు సర్కిళ్లను త్వరగా పూర్తి చేయాలని జేకేజనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిని కలిసి వినతి పత్రం అందించారు. ద్వారకనగర్‌లోని ఎమ్మెల్యే ఆఫీసులో ఆమెను కలిసిన వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సర్కిళ్లను ఆదరాబాదరాగా కొన్ని పూర్తిచేశారని, మరికొన్ని సర్కిళ్లను పూర్తికాకుండానే వదిలేశారన్నారు. క్రిష్ణసర్కిల్ నుంచి దేవునికడప రోడ్డు కొంత భాగం పూర్తయింది, మరికొంత వదిలేశారు. ఎమ్మెల్యే స్పందించి అధికారులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా, శివ, కేశవ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి : ఆర్డీఓ భానుశ్రీ


బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దారు

పులివెందుల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ అన్నారు బుధవారం దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను తహసీల్దారు నజీర్ అహ్మద్‌తో కలిసి తనిఖీ చేసిన ఆర్డీఓ మాట్లాడుతూ దుకాణాలు వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. దుకాణం వద్ద సమృద్ధిగా నీరు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దుకాణాల వద్ద వాహనాలను పార్కింగ్ చేయరాదని దుకాణాలకు వచ్చిన వినియోగదారులు ఎదురుగా ఏర్పాటు చేసిన స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. కాకపోతే ఆమె తనిఖీ సమయంలోనే దుకాణాల వద్ద భారీగా వాహనాలు ఆగి ఉండడం విశేషం. తయారీ తేది లేని టపాసులు దుకాణాల్లో ఉండడం చూసినా ఆమె తయారీ తేది లేని టపాసులను విక్రయించరాదని హెచ్చరించారు.



ఉత్సాహంగా బాణసంచా కొనుగోళ్లు

చెన్నూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఒక రోజు ముందుగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచే పిల్లలు, పెద్దలు బాణసంచా కొనుగోలు చేశారు. గురువారం దీపావళి పండగ కాబట్టి ముందురోజు రాత్రి, పండుగ రోజు బాణసంచా కాల్చాలని పిల్లలు పెద్దలను గట్టిగా కోరడంతో టపాసుల అంగళ్లు ముందురోజే కొనుగోలు దారులతో కిక్కిరిసింది. చెన్నూరు కొత్తరోడ్డు వద్ద టపాసుల అంగళ్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లతోనే టపాసుల అంగళ్లు ఏర్పాటు చేశారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి


జీవామృతం తయారీ చేస్తున్న దృశ్యం

లింగాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవాహన పెంచుకోవాలని ఏఓ రమేష్ తెలిపారు. ఇప్పట్లలో పొలం పిలుస్తోందిలో ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులను ఉపయోగించడం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో వివిధ పంటల్లో ఉపయోగించే ఘన, ద్రవ జీవామృతం తయారుచేసి రైతులకు అవాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం సిబ్బంది భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే


రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో టీడీపీ నేత హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నబీకోట్‌లో నూతన రేషన్ షాపును ఎమ్మెల్యే మాధవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరుకులను సకాలంలో ఇవ్వాలని సూచించారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

పెండ్లిమర్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శనగ పంట సాగుచేసుకునే రైతులు విత్తన శుద్ధి తప్పక చేసుకోవాలని ఏఓ జి.పి.ఓబులేసు, రైతు శిక్షణ కేంద్ర వ్యవసాయాధికారి పద్మజ పేర్కొన్నారు. రంపతాడు, ఎగువపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో వారు మాట్లాడుతూ విత్తనాన్ని విత్తుకునే ముందు ప్రతి కిలో విత్తనానికి 10గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, 3 గ్రాముల థైర్ లేదా 2.5గ్రాముల కార్బండిజమ్ విత్తనశుద్ధి చేయడంతో నేల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చన్నారు. ఎగువపల్లెలో వేణుగోపాల్‌రెడ్డి శనగ పంటలో విత్తనశుద్ధి ప్రయోగాత్మకంగా చేయించి వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అశోక్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి ఎగువపల్లె తుమ్మల కాశీవిశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

సికెదిన్నె, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు భరోసా అని టీడీపీ నేత ఏటూరు రామచంద్రారెడ్డి తెలిపారు. బలిజపల్లె, కొన్నేపల్లె గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఆరోగ్యభద్రత రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త దీమాగా ఉండాలన్నారు.

















గండికోట నుంచి 9వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి బుధవారం 9000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా 7000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

మైదుకూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండల పరిధిలోని విశ్వనాథ పురం వద్ద ఆటో అదుపు తప్పి మల్లేశ్వరి (45) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మైదుకూరు నుంచి వనిపెంటకు వెళుతున్న ఆటోకు కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మల్లేశ్వరీ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కెమికల్ ట్యాంకర్ బోల్తా

ముద్దనూరు అక్టోబరు30(ఆంధ్ర జ్యోతి):మండల పరిధి కడప, తాడిపత్రి హైవేరోడ్డులోని జమ్మ లమడుగు బైపాస్ రోడ్డు సమీ పంలో మంగళవారం రాత్రి కెమికల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. చెన్నై నుంచి ముంబైకి కెమికల్ లోడు ట్యాంకర్ వెళ్లుతోంది. బైపాస్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపు తప్పి ప్రమాదానికి గురైంది.ఎటువంటి ప్రమాదం జరుగలేదు.డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు.

కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

జమ్మలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలంలో మద్యం మత్తులో కన్న కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. బుధవారం జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో జమ్మలమడుగు హ్యూమన్‌రైట్స్ నియోజకవర్గ అధ్యక్షురాలు అన్నపురెడ్డి రాణి, న్యాయవాది రామమోహన్ డీఎస్పీని కలిసి మాట్లాడారు. కన్నకూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇందుకు డీఎస్పీ సందించి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించామన్నారు.

3న కార్తీక వనభోజనాలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియ కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని నవంబరు 3వ తేదీ నిర్వహిస్తున్నట్లు తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య తెలిపారు. బుధవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో వనభోజన మహోత్సవం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తేదీ ఉదయం 5 గంటలకు తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం వద్ద నుంచి 15 బస్సులు, 10 కార్లు, ఇతర వాహనాల్లో వెళుతామన్నారు. మోపూరు భైరవేశ్వరస్వామి, రంగనాథస్వామి ఆలయం, సంగమేశ్వరస్వామి ఆలయాల వద్ద వనభోజన మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద రామమోహన్, పుల్లగూర రమణ, సుబ్బయ్య, రుద్రయ్య, రామయ్య, సుబ్బన్న, హరి పాల్గొన్నారు.


వైష్ణవి స్కూలులో ముందస్తు దీపావళి వేడుకలు

పోరుమామిళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని శ్రీ వైష్ణవి సీబీఎస్ఈ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆ పాఠశాలలో కరస్పాండెంట్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు ఎంతో ఆనందం కలిగించే పండుగల్లో దీపావళి ఒకటని, శ్రీకృష్ణుని సమక్షంలో సత్యభామ నరకాసురున్ని వధించిన రోజు కనుక నరక చతుర్దశిగా జరుపుకుంటారన్నారు. దీపావళి సందర్భంగా టపాసులు కాల్చడం వల్ల క్రిమికీటకాలు నాశనం చేసి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు.



నరకాసురుని వధ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


















వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ



బద్వేలు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాళెం గ్రామంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి బుధవారం కామసముద్రం మురళి కుటుంబ సభ్యులు ఒకటిన్నర కిలోల వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ వేద పండితులు, ఈవో, కమిటీసభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కిరీటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మెంటా అశోక్, కామసముద్రం హర్షబాబు, ఆలయ సిబ్బందికుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూ తగాదా విషయమై... ఇరువర్గాల మధ్య ఘర్షణ

- గొడ్డళ్లు, కర్రలతో పరస్పర దాడులు
- ఇరువర్గాల వారికి తీవ్ర గాయాలు

జమ్మలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామంలో భూ తగాదా విషయ మై బుధవారం ఉదయం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల వారు గొడ్డళ్లు, కర్రలతో పరస్పర దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల వారికి తీవ్ర గాయా లయ్యాయి. సంఘటనకు సంబంధించి పోలీసుల వివరాల మేరకు... జమ్మలమడుగు మండలం పెద్దదండ్లూరు గ్రామంలో గత కొంత కాలంగా భూమి తగాదా ఉంది. 306, 306లో 4ఎ, 306లో 5ఎ సర్వే నంబర్లలో పొలాలకు సంబంధించి ఏరువ హనుమంతరెడ్డి, శేషారెడ్డి వారి బంధువుల మధ్య గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో పవన్ అనే వ్యక్తికి ఆ పొలాలకు సంబంధించి కౌలుకు ఇచ్చారు. దీంతో మళ్లీ గొడవ చోటు చేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో ఏరువ హనుమంతరెడ్డి, రామనాథరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు పొలం వద్దకు వెళ్లి సాగు చేసిన పెసర పంటను దున్ని చెడగొట్టాలని చూశారు. అదే సమయంలో అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రత్యర్థివర్గం పూలతోట గురివిరెడ్డి, దాసరయ్యగారి రామాంజనేయరెడ్డి, పూలతోట సద్దల్‌రెడ్డి, యల్లారెడ్డి, రామమోహన్‌రెడ్డి, మరికొంతమంది గొడ్డళ్లు, కర్రలతో వైసీపీ నేత ఏరువ హనుమంతరెడ్డి, అతని అన్నదమ్ములపై దాడి చేశారు. ఈ ఘటనలో హనుమంతరెడ్డి తలకు తీవ్ర రక్తగాయం కాగా మిగతావారికి రక్తగాయాల య్యాయి. అలాగే ప్రత్యర్థివర్గమైన పూలతోట గురివిరెడ్డి కుడికాలు విరిగింది. రామమోహన్‌రెడ్డి, సద్దల్‌రెడ్డి తదితరులకు రక్తగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ లింగప్ప, ఎస్‌ఐలు రామక్రిష్ణ, కల్పన, అర్బన్ పోలీసు యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. గాయపడినవారిని 108 ద్వారా జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఏరువ హనుమంతరెడ్డి, సద్దల్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డిల తో పాటు మరికొందరు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు, ఇతర ప్రాంతాలకు తరలించారు. కాగా వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. కాగా, ఘటనకు సంబం ధించి ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్, సీఐ లింగప్ప విలేకరులతో మాట్లాడారు. పెద్దదండ్లూరు గ్రామంలో జరిగిన ఘర్షణ రాజకీయ గొడవ కాదని తెలిపారు. ఈ ఘటనలో ఎంతటి వారున్నా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కన్నుల పండువగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పూజల అనంతరం లోకకల్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి ఆలయ కాలక్షేప మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణంను ఘనంగా నిర్వహించారు.



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషారాణికి ఈశ్వరీదేవి అమ్మవారి చిత్రపటం, కాలజ్ఞాన పుస్తకం అందిస్తున్న పీఠాధిపతి శివకుమారస్వామి దంపతులు

విషద్రావణం తాగి వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సి పాలిటీ పరిధిలోని వినాయకనగర్‌లో నివాసముంటున్న బీపీ నడిపి సుబ్బరాయుడు (70) విషద్రావణం తాగి మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆర్థిక పరిస్థితులే ఆయన మృతి కారణమని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ఖాజీపేట , అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరు గ్రామంలో 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మోహన్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మిడుతూరు గ్రామానికి చెందిన భాస్కర్ చిల్లర అంగడిలో మద్యం అమ్ముతున్నట్లు రాబడిన సమాచారం మేరకు దాడి చేయగా 34 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని, భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని అన్నారు.

టపాసుల దుకాణాల వద్ద గొడవ

జమ్మలమడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో బుధవారం రాత్రి టపాసుల దుకాణాల వద్ద గొడవ చోటు చేసుకుంది. దుకాణాల వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ప్రజలు అధికారులకు తెలియజేసినట్లు తెలిసింది. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారి సత్యంరెడ్డి టపాసుల దుకాణాల వద్ద తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, దుకాణాల యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఓ దుకాణం యజమాని జమ్మలమడుగు మండలం రెవెన్యూ సిబ్బందిలో ఆర్ఐ అధికారికి రెవెన్యూ సిబ్బంది విలేకరుల పేరుతో ఒక్కొక్క బాక్సు రూ.2 వేల నుంచి రూ.2,500 విలువ చేసే 45 బాక్సులను ఆర్ఐకి ఇచ్చినట్లు, మళ్లీ దుకాణాల వద్ద గొడవ ఏంటని టపాసుల దుకాణాల వారు అధికారులపై ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు, ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఇలా చేయడం పద్ధతి కాదని, పలువురు మాట్లాడటం జరిగింది. జమ్మలమడుగులోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీవారు ఆర్డీవో కార్యాలయంలో వెళ్లి విలేకరుల పేర్లు చెప్పి రెవెన్యూ వారు ఇలా తెచ్చుకోవడం న్యాయమేనా అంటూ చెప్పడం జరిగింది. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లు చేయించి సమస్య సద్దుమనిగేలా చేశారు. అధికారులు ఇలాంటి దౌర్జన్యాలు చేయడం, ఇతరుల పేర్లుచెప్పి తీసుకోవడం మంచి పద్ధతి కాదని పలువురు దుకాణాల వద్ద చెప్పుకోవడం జరిగింది.

ఇసుక అక్రమ రవాణాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- రాళ్ల దాడిలో పలువురికి గాయాలు
- పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదు


దాడికి గురైన గురివిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె పంచాయతీ రామాపురం గ్రామం వద్ద బుధవారం పెన్నానది నుంచి ఇసుక అక్రమ తరలింపు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పరస్పరం ఇరువర్గాలు రాళ్లతో దాడు లకు దిగడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. రామా పురం గ్రామానికి చెందిన సురేంద్ర, ప్రదీప్ మరికొందరు కలిసి ఇసు కను అక్రమంగా తరలించడానికి పెన్నానదిలోకి ట్రాక్టర్లు తీసుకొని గురివిరెడ్డి పొలంగుండా వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో గురివిరెడ్డి అలియాస్ గుర్రప్ప తన పొలంగుండా పెన్నానదిలోకి వెళ్ల వద్దని అభ్యంతర పెట్టాడు. దీంతో ప్రదీప్, సురేంద్ర మరికొందరు కలిసి గురివిరెడ్డిపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెన్నానదిలో నుంచి ఇసుకను ట్రాక్ట ర్లతో తరలించడానికి రామాపురం గురివిరెడ్డి అక్రమంగా గేటు వసూ ళ్లు చేస్తున్నాడని.. ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబితే నీకు గేటు ఎందుకు చెల్లించాలని గురివిరెడ్డిని సురేంద్ర, ప్రదీప్‌లు ప్రశ్నించారు. దీంతో గురివిరెడ్డి మరి కొందరితో కలిసి తమపై రాళ్లతో దాడికి తెగబడ్డారని సురేంద్ర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులపై రూరల్ పోలీసులు కేసుల నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు. కాగా గాయాలతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాపురం గురివిరెడ్డిని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పరామర్శించారు.

ఆర్థిక సహాయం

బద్వేలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని రామాంజనేయనగర్‌లో ఇటీవల ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి రూ.10లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గురుమోహన్, మాజీ స్టేట్ డైరెక్టర్ సుందరరామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, బంగారు శ్రీనయ్య, పుత్తా శ్రీరాములు, యద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.